

# జీవితపు విలువలు

రచన: రాంషా.

క్రొత్తగా పడుతూన్న సిమ్మెంటు రోడ్డుమీంచి నడుస్తున్నాం నేనూ మా వెంకట్రావూ. చిక్కని చీకట్లని చీల్చుకొంటూ ఎలక్ట్రిక్ కాంతులు మా సిల్కు లాల్చీల వీపుల్ని తళతళ మనిపిస్తున్నాయి. తొమ్మిదిగంటలన్నా కాలేదు; అప్పుడే పట్టణం మాటుమణిగింది. దూరంగా రేడియోలో సైగల్ సంగీతం వినవస్తోంది శాండల్ సోపుతో స్నానాలు చేసిన మా శరీరాల మీదకి సన్నని గాలిపొరలు సోకి మృదువుగా స్పర్శిస్తున్నాయి.

రోడ్డుమీది నీటిమళ్ళగట్లు కాళ్ళకు తగిలి నడకను మెలిపెడుతున్నాయి. ఏదేదో మాట్లాడుకుంటున్నాం.

“ఎనభైవేల కరుకులుపోసి ఒక మైలు మేర సిమ్మెంటురోడ్డు పోయకపోతే, జలాధారాలు బాగుచేయించి కుళాయిలు వేయించకూడదా? ఎందుకు తోచదో ఈమునిసిపాల్టీలకి!” అన్నాడు వెంకట్రావు.

“ఇంతకీ మీనాన్నగారికేం జబ్బు చేసింది?” అన్నాను.

“నారకురుపులురా, తీసుకు తీసుకు చచ్చాడు.” అన్నాడు. చిరాకుగా పెడమొఖం పెట్టాను. ఆపక్కనే అరుగుమీద ఎవరో అమ్మాయి నిలబడింది. గంధరాజ్ పరిమళం సోకగానే వెంకట్రావు కూడా ఆమెకేసి తిరిగాడు. ఆమెనవ్వింది.

నాలుగడుగులు మాకు తెలియకుండానే ముందుకు వేశాం. వెంకట్రావు అడుగుల్ని బరువుగా వేస్తున్నాడు. ఎంత కాదన్నా నేను నీతిపరుణ్ణికనుక పాదాలు నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తున్నాను. “ఎవర్రా?” అని వాణ్ణి అడగాలనుకున్నాను. అడగటం నాపరువుకి భంగమని నాకు స్పష్టంగా తెలుసు. పొరపాటున అడిగానేమో ఇప్పుడు చెప్పలేను.

"ఆమెరా, అనార్కలీలో నాయిక వేసింది!—ఆమె" అన్నాడు వెంకట్రావు. అతను తీసుకున్న చనువుకి ఇప్పుడయితే ఆశ్చర్యంగానే ఉంది; అప్పుడెందుకు ఆశ్చర్యంకాలేదో ఇప్పుడు చెప్పలేను.

"ఉహుఁ. అయితే?" అన్నాను.

"అబ్బే, ఏమీ లేదు." అని మరి నాలుగడుగులు ముందుకు వేశాడు.

కొంచెంఆగి, "ఏమిరా వీళ్ళదగ్గర జబ్బులుండవురా?" అన్నాను.

"అయితే ఆమెనీకు కావాలాఏం?" అన్నాడు.

ఇంకో సమయంలో అతనలా అని ఉంటే ఏంచేసేవాణ్ణో. బహుశా చంప పగలగొట్టి ఉండేవాణ్ణి. సమయం కాని సమయం కనక:

"అహఁ. ఊరికే క్యూరియాసిటీకి" అన్నాను.

"వాళ్ళనంత అసహ్యంగా చూస్తావు కదా, నీకువాళ్ళేం అపకారంచేశార్రా?" అన్నాడు.

"ఏడిసినట్టే ఉన్నాయి నీ తెలివి తేటలు; వాళ్లు సంఘానికి వేరుపురుగులు; ఇంటినీ వంటినీ గుల్లచెయ్యటంతప్ప..."

నీతిని వెనకేసుకొని మనుష్యుడు తాను గొప్పవాడవటానికి ఎంత అవకాశముందో అంతనీ ఆసమయంలో సద్వినియోగం చేసుకున్నాను.

"తరతరాలనుంచీ వస్తూ, మన ప్రశంసల్ని పొందిన శృంగార కవిత్వమంతా ఈ సానివాడల్లో ప్రతిఫలిస్తోంది. వారినట్టా తయారుచేసింది ఈ సమాజమేనని నువ్వు మరచి పోతున్నావు." శత్వ వేత్తలా ముఖంబిగించి, ఒక్కసారి దీర్ఘంగా నిట్టూర్చాడు.

"నాలుగిచ్చావో నాలుగు లక్షలు పుచ్చుకుంటావ్—అదికూడా చెప్పు." అన్నాను, హాయిగానవ్వి.

"అలానా?...అయితే ఇలారా."

రెక్కపుచ్చుకొని గబగబా వెనక్కిలాక్కు పోయాడు. నీతికీ అవినీతికీ మధ్యజరిగే యావత్తుసంఘర్షణా, ఈడ్చుకొంటూన్న నాకళ్లల్లోనూ, ఉరకవేస్తున్న నా ఉత్సాహంలోనూగోచరించి ఉంటుంది.

"పూర్ణా!"

పూర్ణ తలుపుతీసింది. చిన్నగానవ్వి కుర్చీ చూపించింది. నన్ను కుర్చీలో కూర్చోమన్నట్టు మావాడువెళ్లి ఆమె మంచంమీద కూర్చున్నాడు. ఆ మెశరీరం తప్ప ఆమంచంగాని, ఈకుర్చీగ్గాని, ఆపక్కనే గోడగూట్లోఉన్న పింగాణీ కప్పులుగాని ఆమెవై వుండవు. గది బైటకెళ్లి తలుపు వారగా నిలబడింది.

అక్కడి కెందుకొచ్చానో నాకు తెలియదు; అలా ఎందుకు కూచున్నానో నాకు తెలియదు; ఆతరవాత ఏంకాబోతున్నానో నేనూహించలేదు.

"మంచినీళ్లు కావాలా?" అంది.

'ఓహో! ఏంపతివ్రత! ఎంతసిగ్గ నటిస్తోంది!... వెధవటక్కులు!' అన

కున్నాను. 'తలుపుచాటుగా నిలబడ్డది. సిగ్గుగావును! పరాయివాళ్ళొస్తే నా భార్యకూడా సిగ్గు పడుతుంది; నా భార్యకూడా తలుపుచాటున నిలబడుతుంది. నా భార్యకూడా మంచి నీళ్ళడుగుతుంది.' ఛీ వెధవ ఆలోచనలు! నక్కకీ నాకలోకానికీ సామ్యం తెస్తున్నానా?

''మంచినీళ్ళు కాదు; ముందుతాంబూలం పట్రా మావాడికి'' నాగుండెలు ఝల్లుమన్నాయి; శృతిమించి రాగానపడేటట్టుంది. నన్నిగదిలోవిడిచి పెట్టిపోతాడు గావును!

ఆమెతనకుతనే చొరవతీసుకుని పలకరించచ్చు. పలకరించటమేమిటి కౌగలించుకోవచ్చు. తను నాకోసం ఎట్లా కలగన్నదీ కథచెప్పి, లాలించి లాలించి ''ఓహో ఓ పావురమా!'' అనిపాడి - అన్నట్టు ''స్వర్గసీమ'' లో జయమ్మలా నా భార్యవస్తే!

నా గుండెలమీదకూర్చుని నా భార్య ''నాకు అన్యాయం చేస్తావా?'' అని అడిగినట్టయింది.

''అరే, అలాపట్టుకునిలబడిపోయింది తీసుకోవేరా?''

నములుతున్నాను; వణుకుతున్నాను; ఆశిస్తున్నాను; చెంపలు వాయించుకుంటున్నాను.

''వీడు పెద్దడాక్టర్లే. కాకినాడలో పెద్ద ప్రాక్టీసు పెట్టాడు. మీ అక్కని ట్రీట్ చేస్తాడని తీసుకొచ్చాను ...ఒరేయ్ పేదవాళ్ళని ఫీజు విషయంలో కఠినంగా చూడకూడదురా. కేసంతావిని, ఏదైనా ట్రైచేయి. ఫీజు కావలిస్తే నేను చెల్లించుకుంటానులే.''

ఆమాటలకి నేను తృప్తిపడ్డాను. ఎప్పుడో ఒకసారి నాటకంలో మాత్రమే నేను డాక్టర్ నయ్యాను. ఇప్పుడు మళ్ళీ ఈ అవతారం దాల్చాల్సి వచ్చింది. ఏసిఫ్లిటిక్ పేషంటునో నాముందుకు తెచ్చి నాఅంతు చూసేట్టున్నాడు.

ఆమెకూడా కంగారుపడింది. ఒకసారి పమిటసర్దుకొని, చెంగుముందుకు కప్పుకొని, చేతులు కట్టుకు నిలుచుంది.

''చెప్పేయ్, నిజమంతా చెప్పేయ్. ఏమీదాచక. నీఅదృష్టం బాగుంటే మీ అక్కకి పిచ్చికుదరచ్చు. మీఇద్దరూ తలో నాలుగురాళ్ళూ ఎలాలేదన్నా సంపాదించుకోగలుగుతారు...వినరా!'' అన్నాడు సాధికారంగా వెంకట్రావు.

రోజుకి నాల్గు రూపాయలా?... నాలుగేమిటి నలభైదాకా కావచ్చు. మూడు నాలుగులు పన్నెండు. నెలకి పన్నెండు వందలన్నమాట. పన్నెండు పన్నెండ్లు నూటనలభై నాలుగు. అంటే సాలీనా నూటనలభై నాలుగు వందల రాబడి! పెట్టుబడి ఖర్చులు నాలుగువేలు పోయినా పదివేలపైన మిగులుతుంది. వీళ్ళకి వృత్తిపన్ను లేదు కాబోలు!

''ఫరవాలేదు చెప్పు. సుమారు ఎన్నేళ్ళబట్టి?''

◆ ◆ ◆

సుమారు ఆరు సంవత్సరాలనించి సుభద్ర ఒక్కలా ఉంటోంది. సుభద్ర

పూర్ణకి పినతండ్రి కూతురు. సుభద్రకు ముందుగాని, సుభద్ర తర్వాతగాని వాళ్లకి పిల్లల్లేరు. పదమూడేళ్లు వచ్చే దాకా చాలా గారాబంగా పెరిగింది సుభద్ర.

జావళీలు, కృతులు, తరంగాలు-అన్నీ శాస్త్రీయంగా గురువుదగ్గర నేర్చుకొంది. జగదాంబదగ్గర అభినయం నేర్చుకొంది. పదిహేనేళ్లకే పదంపట్టడంలో ముగ్ధలా మెప్పించగలిగేది.

చలమయ్య శెట్టిగారు ఆమెకి కన్నె చెర విడిపించారు. ఆకన్నెరికం కూడా వట్టి ఆషామాషీగా జరగలేదు. కులం వాళ్ల నందర్నీ రెండుపూటలా భోజనాలకి పిలిచి, నేతితో పలావు చేయించి సమృద్ధిగా వడ్డింపించారు. జోగమ్మత్త, కృష్ణయ్యగారు — ఒక్కరేమిటి, ఎందరో ప్రశంసించారుకూడా. కోడిపలావు కాకుండా వేటపలావు పెట్టినందుకు మాత్రం జోగమ్మత్త కొంచెం బుగ్గలు నొక్కుకుందట!

శెట్టిగారుకూడా సరసుడే. ఆతరవాత సుమారు వారం రోజులదాకా అక్కడే అట్టే ఉండిపోయాడు. ఆతరవాత సుభద్ర సిఫిలిస్‌కు మందిప్పించుకొందిట! అప్పటికి పూర్ణకి బొత్తిగా చిన్నతనం. అంతకు తరవాత విషయాలేమీ ఆమెకు జ్ఞాపకం లేవు.

ఐదారునెలలు గడిచిపోయ్యాక ఒకసారి సర్వవరం మేళానికెళ్లింది. నాయకురాలితో కలిసి మొత్తం పదకొండుగురు వెళ్లారు. ఉన్నవాళ్లల్లో కుర్రదీ, రూపసీ కావటంచేత సుభద్ర నే పాడించమన్నారట పెళ్లివారు. మువ్వగోపాల పదం పాడుతోంది సుభద్ర. తన కూతురు ప్రజ్ఞకి విజయగర్వంతో ఒళ్లు మరిచి ఫిడేలు వాయిస్తున్నాడు ఆమె తండ్రి. సదస్యులంతా ఆనందోద్రేకాలతో మునిగి పోయ్యారు. పాట ముక్తాయింపు కొచ్చింది. చటుక్కున ఆగిపోయింది సుభద్ర. ఆమె పమిట జారిపోయింది. సొమ్మసిల్లి పడిపోలేదు; కొయ్యబారి నిలబడి పోయింది. కృష్ణమాచారి పరవశమై పొయ్యాడు. నాయకురాలుముఖం చిట్లించుకొంది. ఫిడేలు అక్కడ పారేసి చరచరా వెళ్లిపోయాడు తండ్రి. సభ రసభంగం కావటం అందరికీ తలవంపులుగా ఉంది.

ఎప్పుడో ఎలాగో విడిదిలోకి చేరాడు కృష్ణమాచారి. వాళ్ళిద్దరూ ఎలాకలిశారో ఆవైనం — చిన్నపిల్లేకనక — పూర్ణకి తెలియవు.

కొంతకాలందాకా రాత్రింబవళ్ళు కృష్ణమాచారి సుభద్ర ఇంటిలోనే ఉండిపోయినట్టుమాత్రం పూర్ణకి జ్ఞాపకముంది. సుమారు నాలుగువేలు ఖరీదుచేసే నగలు పెట్టాడు కృష్ణమాచారి. నెలకు రెండు వందలకు తక్కువకాకుండా ఆమె కుటుంబఖర్చుకూడా పెట్టాడు. సుభద్ర తండ్రి—బస్తా నాలుగు రూపాయలన్నా ఆరోజుల్లో—సిల్కుబట్టలే వాడేవాడు.

ఆరునెలలు ఆరుగంటల్లా గడిచిపోయాయి. పదివేలరూపాయలఆస్తి పదణా కాసుల్లా చెల్లిపోయింది. సుభద్ర తండ్రి ముతకబట్టలు కట్టలేని స్థితిలో కొచ్చాడు. కాని సుభద్రమాత్రం కృష్ణ

మాచారిని విడిచి పెట్టేసి తిక్కి రాలేక పోయింది.

ఆ రాత్రిల్లయితే నేంగాక — భారీగా బ్రతక నేర్చిన తల్లి ఇక సంసారం చేయ లేనంది.

ఆ తల్లిదండ్రులిద్దరూ సుభద్రని ఏమనే వారో ఏమో ఆమె తన తల్లిని కత్తితో చంపెయ్యాలని ప్రయత్నించింది. తప్పు సుభద్రది కాకపోవచ్చు. [“ఆ యెదవ సచ్చినాడు బుజ్జగించి నూరిపోయబట్టి ఈ వెర్రికుట్టి అలా చేసింది.”] ఆ వెర్రికుట్టి ఏం చేసినా దాని బాధ్యత ఆ “యెదవ సచ్చినా”డిదే కనక ఆమె లేచిపోయి నందుకు బాధ్యతకూడ అతనిదే.

ఆమె లేచిపోయిన ఆ రాత్రిదాకా ఆమె ఆనూపానూ ఎవ్వరికీ దొరక లేదు. కనుక అంతదాకా ఆమెతండ్రికూడా ఆవిణ్ణి ఇంటికి తెచ్చే ప్రయత్నం చేయ లేదు.

ఒకసారి నూజివీడు సినీమాలో వాళ్ళిద్దరూ పూర్ణతండ్రికి కనిపించారు. అతను స్వతహాగా పెద్ద మనిషే కనుక ఆమె చేసిన మంచి పనిని ప్రశంసించి మూడురోజులు వాళ్ళింట్లో అతిథిగా ఉన్నాడు. కృష్ణమాచారిఅంతదరిద్రంలో కూడా తను పెట్టిన నగల్ని అమ్ముకో కుండా ఉండటం అతనికి ఆశ్చర్యం వేసింది.

తన ఆశ్చర్యాన్ని పూసగుచ్చినట్టు తన తమ్ముడితో చెప్పాడు. ముతక బట్టల్లో ఇబ్బంది పడలేని తమ్ముడు అన్నను ఛెడామడా తిట్టాడు. “నువ్వు కూడా అక్కడే సావలేక పోయావ్? మక్కలిరగదన్ని తీసుకురాక మళ్లీ యెదవ మొగం వేసుకువచ్చావా?” అన్నాడు.

అన్న తమ్ముడి మాట కాదనలేక పోయాడు. పేగుపీకింది. పూర్ణను వెంట బెట్టుకొని, సుభద్రకి కొంత నయానా. భయానా నచ్చచెప్పుదామని వచ్చాడు పూర్ణతండ్రి.

పూర్ణ వెళ్ళేటప్పటికి సుభద్ర కృష్ణ మాచారి తొడమీద తలపెట్టుకొని పడుకునుంది. అతను ఆమె కురుల్ని సవ రిస్తున్నాడు.

వెడుతూనే కత్తితీసి “పొడుస్తాను వెధవ కదిలేవంటే” అన్నాడు పూర్ణతండ్రి. కృష్ణమాచారి కొయ్యబారి పోయాడు. పెదాలు తెరచుకున్నాడు. నోటితో పీల్చిన గాలిని విడిచిపెట్టలేదు. పూర్ణతండ్రి ముందుకురికి సుభద్రతలముడి పట్టుకొని బైటికి ఈడ్చుకెళ్లి కారులో పడేశాడు. గొల్లుమని రాగాలు పెట్టింది సుభద్ర. మెలికలు తిరిగి గిలిగిలాకొట్టు కొంది సుభద్రదీనంగా. కృష్ణమాచారి కళ్ళంట నీళ్ళు కారుతున్నాయి.

కారు వెళ్లిపోయింది.

పూర్ణని మరిచిపోయాడు తండ్రి. ఆ భీభత్సదృశ్యానికి భయపడి కొంతా, తన తండ్రి తన్నిక్కడ వదిలేసి పొయ్యాడే అన్నదిగులుతో కొంతా వెక్కి వెక్కి ఏడ్చింది పూర్ణ. కృష్ణమాచారి అరగంటకి కాని మేలుకోలేదు. చిన్నపిల్లాడికంటే కనిష్టంగా భోరున ఏడ్చాడు. తరువాత

పూర్ణకి మంచినీళ్లిచ్చి, స్వీట్లు పెట్టాడు. ఆవేళా ఆమరునాడూ కూడా అతనికి భోజనం లేదు.

ఆమరునాటి సాయంత్రానికి పూర్ణ తండ్రి వచ్చాడు. తన కూతురు బతికి ఉంటుందనే ఆశ అతనికి లేదు. వస్తూనే దిగులుగా ముఖం పెట్టే కృష్ణమాచారిని ఓదార్చాడు. వేశ్యల వలపులు అశాశ్వతమని చెప్పాడు. చక్కని కులాంగనని పెళ్ళాడి హాయిగా బతకమని ఆశీర్వదించాడు.

వెళ్లిపోతూ దారిలో "అదొంగ చచ్చినాడు నిన్ను బతకనిస్తాడనుకో లేదు." అన్నాడు. "నువ్వెందుకే కుర్రముండ ఏడుస్తావు. వాడి బాబులాంటి వాడిం కొకడొస్తాడు దానికి. పిల్లకాకి కేం తెలుసు ఉండేలదెబ్బ." అన్నాడు.

ఇంటికొచ్చిన నాలుగ్రోజులదాకా సుభద్ర ప్రపంచంలో లేదు. అంతలోకి స్పృహతప్పిపోయేటంత అఘాయిత్యం నిజంగా జరిగిఉండక పోవటం [''ఇంటికొచ్చి సుఖంగా ఉండవే చిన్నదానా! అంటే యెదవవేసా లేస్తుంది.''] వల్ల అదంతానటనే అని పెద్దలు నిశ్చయించారు.

తండ్రి ఆమె వొంటిమీది నగలన్నీ ఇచ్చేయమన్నాడు; ఆనగలతో తన తండ్రికేమీ సంబంధం లేకపోయినా ఆజన్మవైరీనంతనీ వలిచి వాడి మొహాన్ని కొట్టింది. ఎవళ్లతోటీ ఏమీమాట్లాడేది కాదు; ఎప్పుడూ ఆపక్కగదిలో ఒంటరిగా కూర్చునేది.

పిల్లదానికి గాలిసోకిందని తల్లి శోకాలు ప్రారంభించింది; తండ్రి ఎంతమందినో భూతవైద్యుల్ని పిలిపించాడు. కాని ఈగాలి, ఎన్నిదెబ్బలు తగిలినా లొంగకుండా అందర్నీ ఆడిపోసేది.

తండ్రి ఎన్నెన్నోరకాల ఖరీదైన చీరల్ని తెచ్చి ఆమెకు బలవంతాన కట్టబెట్టేవాడు; అంత ఖరీదైన చీరల్నికూడ ఆమె పరపరా చింపేసి నగ్నంగా ఊరిబైట కొండలమీదికి పరుగెట్టేది. పువ్వులతోటీ, గుబురతోటీ, బండరాళ్లతోటీ మాట్లాడుకొనేది. కొండలు ప్రతిధ్వనించేలా పాటలు పాడేది.

ఆమె మనస్సు మళ్లించాలని తండ్రి తనశక్తికొద్దీ ప్రయత్నించాడు; పువ్వులు కొని తెచ్చేవాడు; అందమైన యువకుల్ని ఆహ్వానించేవాడు. సినీమాలకి గానకచేరీలకీ తీసుకెళ్లేవాడు; నవ్వమని కొట్టేవాడు; లాలించమని బాధించేవాడు. మేళానికి కూడా తీసుకెళ్లి తనెదురుగా కూర్చొని పాడించేవాడు.

ఈప్రయత్నాలన్నీ అతనివిషయంలో నిష్ఫలాలే అయినయ్. సుమారు మూడేళ్ళు పోయానక ఆమె తండ్రి చచ్చిపోయాడు. అప్పటికి పూర్ణ పెద్దమనిషైంది. పూర్ణ తెచ్చే సంపాదన పూర్ణ తండ్రికి సరిపోతున్నా అతనికి తృప్తి కలగలేదు. సుభద్రని తనఇంటికి తెచ్చుకున్నాడు. సుభద్రమీద వ్యాపారానికి ప్రయత్నించేవాడు.

సుభద్ర ఎవళ్ళతోటీ ఏమీమాట్లాడేది కాదు; గదిలోకివచ్చి తలుపులు బిగించు

కున్న యువకులతోటి ఒకటి రెండు మాటలనేది: "రాత్రిరండి.'' తెల్లార కట్టరండి.''—వాళ్ళు భయపడేవారు; మరికొందరికి అభ్యంతరం లేకపోయినా ఆమె తలుపు తీసేదికాదు.

పూర్ణతండ్రికి కాళ్ళూ చేతులూ పడిపోయాయి. పక్షవాతం. పూర్ణకి పెత్తనం వచ్చింది. పూర్ణ కృష్ణమాచారి కోసం కబురంపింది. కృష్ణమాచారి వచ్చాడు; నాలుగు రోజులున్నాడు; గుండెబద్దలయ్యేలా ఏడ్చాడు.

కృష్ణమాచారి వచ్చాడంటే ఆమెకి నమ్మకం లేదు; 'నాలుగేళ్ళకిందటి కిష్ణమాచారి ఇంకా రావటమేమిటి? వట్టిది; ఆయనరారు; నాన్నచంపేస్తాడు.'' అనేది.

నిజంగా గతించిన ఐదేళ్ళలోనూ ఆమెదృష్టిలో కృష్ణమాచారి నాలుగైదు సార్లు వచ్చాడు.

"కృష్ణమాచారి వచ్చాడు; అమ్మలూ తలుపుతియ్యే.''

తాను తలుపుతీసేది; గంపెడాశతో దిక్కుల్ని కలయవెదికేది. చటుక్కున ఎవరో ఒకవ్యక్తి తోసుకొని లోపలికెళ్ళిపోయేవాడు. ఆ 'కృష్ణమాచార్లు'' కి సుభద్రమనః ప్రవృత్తి ఏంకావాలి కనుక?

వాళ్ళని రక్కేదనీ, కరిచేదనీ, వాళ్ళతలని గోడనేసిఢీకించేదనీ మనం ఊహించటం, తప్పు. ఆమె ఏమీ చేసేది కాదు. మెదలకుండా ఊరుకొనేది. వెంటనే డబ్బు అక్కడ పెట్టేలా నిర్బంధించేది. అసహ్యంతో వెంటనే అవతలకి నెట్టి తలుపులు బిగించుకొనేది. ఆ "కృష్ణమాచార్లు'' కు అవమానం లేదు.

◆ ◆

ఒక్కసారి నిట్టూర్చాను; నిట్టూరుస్తూనే లేచాను. "రేపొకసారి వచ్చి ఏదో ఆలోచిస్తాను'' అని పైకివచ్చేశాను. నా వెనకాలే వెంకట్రావుకూడ వచ్చేశాడు.

ఆలోచనలతో వేడెక్కిన బుర్రతో ఆ చీకట్లో తడబడుతూ నడుస్తున్నాను. కీచురాళ్ళు జిమ్మని మోతపెడుతున్నాయి. చెట్లలో చీకటి గూడుకట్టుకొంది.

వెంకట్రావు అన్నాడు:

"వేశ్యలు కూడా మనుష్యులే. వాళ్ళకీ మనకు మల్లేనే రక్తమాంసాలున్నాయి; ప్రేమ, హృదయమూకూడా ఉన్నాయి. వాళ్ళు రాక్షసులు కారు; వాళ్ళల్లో మనల్ని చూసుకుంటేనే వాళ్ళు రాక్షసుల్లా కనిపిస్తారు.''

కొత్తగా పడుతూన్న సిమ్మెంటు రోడ్డు మీంచి నడుస్తున్నాం నేనూ మా వెంకట్రావూ. చిక్కని చీకట్లని చీల్చుకుంటూ ఎలక్ట్రిక్ కాంతులు మా సిల్కులాల్చీల వీపుల్ని తళతళమనిపిస్తున్నాయి.